క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు బలవర్ధక పౌష్టికాహారం అందజేస్తుందని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ అంగన్‌వాడీ పాఠశాలలో బాలింతలు, గర్భిణులకు ఆయన పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఆన్‌లైన్ మోసం

గుంటూరు ఈస్ట్ : ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే వి.రాధారాణి ఈనెల మొదటి వారంలో విజయనగరం సమీపంలోని రాజాంకు డీటీడీసీ కొరియర్‌లో లెటర్ పంపింది. లెటర్ చేరకపోవడంతో ఆన్‌లైన్‌లో డీటీడీసీ సర్వీస్ ఫోన్ నంబరు వెతికి ఆ నంబరుకు ఫోన్ చేసింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి రాధారాణికి లింక్ పంపి రూ.5 చెల్లించాలని కోరాడు. దీంతో ఈనెల 6వ తేదీ లింక్ ఓపెన్ చేసి రూ.5 చెల్లించింది. కొంత సమయం తరువాత రూ.5 తిరిగి రాధారాణి అకౌంట్‌లో క్రెడిట్ అయ్యాయి. 7వ తేదీ రాధారాణి అకౌంట్ నుంచి రూ.38వేలు విత్‌డ్రా అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చైన్ స్నాచింగ్‌పై కేసు

గుంటూరు ఈస్ట్: రెండు వేర్వేరు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్ జరిగిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన పి.సరోజిని నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఓ ఆగంతకుడు ఆమె వద్దకు వచ్చి మెడలోని ఆరు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యేందుకు యత్నించాడు. సరోజిని ప్రతిఘటించి కొంత బంగారు చైను తన చేతిలో పట్టుకుంది. మిగిలిన భాగం ఆగంతకుడు తెంచుకుని పరారయ్యాడు. మరో ఘటనలో భీమవరానికి చెందిన సత్యవతి బుధవారం రైలు దిగి దేవాపురం వెళ్లే క్రమంలో రైల్వే క్వార్టర్స్ వద్దకు వచ్చింది. ఓ ఆగంతకుడు ఆమె మెడలోని రోల్డ్‌గోల్డ్‌చైన్ తెంచాడు. దానికి ఉన్న రెండు బంగారు తాళిబొట్లు తీసుకుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పిస్తామని జిల్లా వికలాంగుల సంఘ నిర్వాహకుడు హరికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో ఉత్తీర్ణులై, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు సైతం అర్హులేనని, 35 ఏళ్ల లోపు వయసు గల వారు దరఖాస్తు చేయాలని సూచించారు. ఎం.ఎస్ ఆఫీస్, డీటీపీ, ఫొటోషాప్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి, కేంద్ర ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగావకాశాన్ని కల్పిస్తామని వివరించారు. ఆసక్తి గల వారు గుంటూరు అరండల్‌పేట 8వ లైనులోని ఎస్‌బీఐ కాంప్లెక్స్‌లోని శిక్షణకేంద్రంలో నేరుగా, ఫోన్ నంబర్లు 9346594659, 0863–3568851లోను సంప్రదించాలని సూచించారు.

పోలీస్ పేరుతో మహిళకు బెదిరింపు ఫోన్

మంగళగిరి: నగర పరిధిలో పెదవడ్లపూడిలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్న మహిళకు పోలీస్ పేరుతో ఫోన్ కాల్‌లో బెదిరించిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పెదవడ్లపూడికి చెందిన వడ్లపాటి యువరాణి వడ్లపూడిలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతోంది. బుధవారం ఉదయం తన ఫోన్‌కు తెలియని నంబర్ నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేసి తాను భీమవరం పోలీస్ స్టేషన్ నుంచి రైటర్‌ను మాట్లాడుతున్నానని మీ భర్త ఉన్నారా అని ప్రశ్నించారు. తన భర్తతో మీకేంటి పని అని మహిళ నిలదీయగా ఫోన్ చేసిన వ్యక్తి దుర్భాషలాడడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో యువరాణి రూరల్ పోలీసులకు తనకు వచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అల్పాహారపు మెరుపదిగో

- స్టడీ అవర్లలో టెన్త్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్
- గత మంగళవారం నుంచి అమలు చేస్తున్న నగరపాలక సంస్థ
- 14 హైస్కూళ్లలో 1,368 మంది విద్యార్థులకు లబ్ధి
- ఏప్రిల్ 15వ తేదీ వరకు 33 రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమం



గుజ్జనగుండ్లలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న టీచర్లు

నెహ్రూనగర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు(స్టడీ అవర్లు) నిర్వహిస్తున్నారు. మెరుగైన ఫలితాలే లక్ష్యంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం స్టడీ అవర్లలో విద్యార్థులకు అల్పాహారం అందించాలని నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయించారు. 14వ తేదీ మంగళవారం నుంచి అమలు కూడా చేస్తున్నారు. అల్పాహారం అందించడం వల్ల పిల్లలు మరింత బాగా చదవగలుగుతారని అధికారులు భావిస్తున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 14 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 1,368 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరిలో బాలురు 704, బాలికలు 664 మంది ఉన్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో వీరు స్టడీ అవర్లకు హాజరవుతున్నారు. వీరికి అల్పాహారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఏప్రిల్ 15వ తేదీ వరకు అల్పాహారం అందించేలా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా చర్యలు తీసుకున్నారు. లోటుపాట్లు లేకుండా హెచ్‌ఎంలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున 1,368 మంది విద్యార్థులకు రోజుకు రూ.27,360 అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు.

రోజువారీ అందించే అల్పాహారం ఇలా..

సోమవారం	ఇడ్లీ 4(పెద్దవి), సాంబారు/చట్నీ
మంగళవారం	దోశలు 2(పెద్దవి), చట్నీ
బుధవారం	పూరీలు కూరతో
గురువారం	టమాటా బాత్,చట్నీ
శుక్రవారం	మినప గారె(4), చట్నీ
శనివారం	చపాతీలు 2, కుర్మా
ఆదివారం	పునుగు/ బజ్జీ 4 పెద్దవి

హెచ్‌ఎంలదే బాధ్యత

నగరపాలక సంస్థ పరిధిలోని 14 హైస్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్లలో అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రతి రోజూ అల్పాహారం తీసుకున్న విద్యార్థుల హాజరు పట్టికతో నగరపాలక సంస్థకు ప్రతి నెలా 1న బిల్లు పెట్టుకోవాలి. అల్పాహారం అమలు విషయంలో హెచ్‌ఎంలదే బాధ్యత. ఏమైనా లోటుపాట్లు ఉంటే హెచ్‌ఎంలపై తగిన చర్యలు తీసుకుంటాం.

– పెద్దిరోజా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్నత డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ ఆవుల శ్రీనివాస్, డాక్టర్ సేవకుమార్

గుంటూరు మెడికల్: రోజూ వృత్తిలో నిమగ్నమై ఉండే వైద్యులకు క్రీడలు ఆటవిడుపుగా, మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ గుర్రాల రవికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక గుంటూరు జీఎంఏ హాల్లో గుంటూరు ఐఎంఏ శాఖ నిర్వహించిన క్రికెట్ పోటీల బహుమతుల ప్రదానోత్సవ సభలో డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి గుంటూరు శాఖ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వైద్యులందరూ క్రీడలకు సమయం కేటాయించాలని చెప్పారు. ఐఎంఏ ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. దీనిలో భాగంగానే గుంటూరు ఐఎంఏ శాఖ పది రోజులపాటు డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని ఐఎంఏ శాఖలన్నీ క్రీడా పోటీలు నిర్వహించేందుకు కృషి చేయాలని వెల్లడించారు. పారిశ్రామికవేత్త చుక్కపల్లి రాకేష్ మాట్లాడుతూ వైద్యులు క్రీడల్లో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్ మాట్లాడుతూ గత నెల రోజులుగా డాక్టర్స్ ప్రీమియర్ లీగ్‌కు ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. పోటీల్లో 17 జట్లు పాల్గొన్నాయని, ఏ–1 అవెంజర్స్ డాక్టర్స్ ప్రీమియర్స్ లీగ్ ట్రోఫీని గెలుచుకున్నట్లు వెల్లడించారు. అశ్విని బ్లాస్టర్స్ రన్నర్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ పోటీలకు సహకరించిన ఆస్పత్రులు, వైద్యులు, జేకేసీ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్ డాక్టర్ జి.నందకిషోర్, కే.కృష్ణప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి.ఫణిధర్, కోశాధికారి డాక్టర్ బి.రవీంద్ర, ఐఎంఏ గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి అమరలింగేశ్వరరావు, డాక్టర్ జగదీష్ కే మద్దినేని, డాక్టర్ అప్పారావు, డాక్టర్ ఐ వీ రేణుక, డాక్టర్ జి వేణుగోపాల్, డాక్టర్ ఎస్.కిషోర్, తదితర సీనియర్ వైద్యులు, అధిక సంఖ్యలో యువ వైద్యులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు డాక్టర్ జి.రవికృష్ణ, డాక్టర్ పి ఫణిధర్, డాక్టర్ జి నందకిషోర్ బహుమతులను అందజేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మేడికొండూరు: మండలంలోని శిరిపురం గ్రామానికి చెందిన దొప్పలపూడి నాగరాజు భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. నాగరాజుకు మండలంలోని విశదల గ్రామానికి చెందిన రూతు (రాణి)తో పెళ్లయింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో సొంత గ్రామం విశదల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తుండేది. మంగళవారం శిరిపురంలో భర్త నాగరాజు బజారుకు వెళ్లి వచ్చేలోగా రాణి ఇంటి నుంచి వెళ్లిపోయింది.

క్షయ రోగులకు ఫుడ్ బాస్కెట్లు



ఫుడ్ బాస్కెట్ అందజేస్తున్న డాక్టర్ హమీద చిత్రంలో మస్తాన్‌రావు

గుంటూరు మెడికల్: క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని జయించవచ్చని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ హమీద చెప్పారు. బుధవారం స్థానిక గుండారావుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగులకు గోధుమపిండి, రాగిపిండి, కందిపప్పు, శనగలు, వంట నూనెలతో కూడిన ఫుడ్ బాస్కెట్‌ను అందజేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్ పర్యవేక్షణలో ఎస్‌బీఐ వారు కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా ఫుడ్ బాస్కెట్‌లను అందించారు. టీబీ హెల్త్ విజిటర్ కోనపరెడ్డి మస్తాన్‌రావు క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ సి.హెచ్.ఉష పాల్గొన్నారు.

హెటిరో ఉద్యోగాలకు 41 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, హెటిరో ల్యాబ్స్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో బుధవారం పీజీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన హెటిరో ల్యాబ్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన 41 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ జె.ఉమామహేశ్వరరావు తెలిపారు. యూజీ, పీజీ, ఫార్మసీ కెమిస్ట్రీ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారికి వివిధ దశల్లో ఎంపికలను నిర్వహించినట్లు తెలిపారు. తుది విడతలో యూజీ విభాగం నుంచి 11 మంది, పీజీ విభాగం నుంచి 27 మందితో పాటు ఫార్మసీ విభాగం నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 41 మంది ఉద్యోగాలను పొందినట్లు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉమామహేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, హెటిరో ల్యాబ్స్ ప్రతినిధులు అభినందించారు.

19న రక్తదాన శిబిరం



డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్

గుంటూరు మెడికల్: రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 19న మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీబాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం స్థానిక కొత్తపేట యడ్లవల్లివారి వీధిలోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన అన్నయ్య, ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బి.రవికుమార్ జ్ఞాపకార్థం ఆయన పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను చేస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ రవికుమార్ ఆయన సతీమణి 2008లో గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మరణించారని చెప్పారు. వారి స్ఫూర్తితో తమ ట్రస్టు ఏర్పడిందన్నారు. రక్త కొరతను తీర్చేందుకు తమ వంతు బాధ్యతగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుంటూరు లాలాపేట చిన బజారు పాల ఆస్పత్రి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. సేకరించిన రక్త నిల్వలను గుంటూరు జీజీహెచ్‌కు పేద ప్రజల కోసం అందిస్తామని పేర్కొన్నారు. రక్తదానంపై ఆసక్తికల యువకులు 9849363613, 9908766686 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజాచైతన్యంతోనే హక్కుల రక్షణ

గుంటూరు వినిమయదారుల సంఘ కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న గుంటూరు వినిమయదారుల సంఘ కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ జనాభాలో 65 శాతానికి పైగా ఉన్న యువత, విద్యార్థులు వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకుని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలని గుంటూరు వినిమయదారుల సంఘ కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల రక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఆర్థిక ప్రగతికి వినియోగదారుడే రారాజు అని ప్రభుత్వాలు చెబుతున్నా, చట్టాల రూపకల్పన, అమలులో పాలకవర్గాలతో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల వినియోగదారుడు దారుణమైన దోపిడీకి గురవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తూనికలు, కొలతలు, రవాణా వ్యవస్థలపై నియంత్రణ లోపించడం ద్వారా వినియోగదారుడు పెద్ద ఎత్తున నష్టపోతున్నాడని చెప్పారు. అనేక రకాల వస్తు తయారీలో టోల్ ఫ్రీ నంబర్లు ఇస్తున్నారని, నాణ్యతలో లోపాలు ఉంటే టోల్ ఫ్రీ, కస్టమర్ కేర్ నంబర్లు, వినియోగదారుల కోర్టుల ద్వారా సంబంధిత నష్టపరిహారాన్ని రాబట్టవచ్చునని తెలిపారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా సమన్వయకర్త డి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులతో పాటు పర్యావరణాన్ని, పచ్చదనాన్ని కాపాడే సైనికులుగా విద్యార్థులు సమాజాన్ని జాగృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వినిమయదారుల సంఘ నాయకులు రామకృష్ణారావు, విజయలక్ష్మి, ప్రజ్ఞ పాఠశాల కరస్పాండెంట్ ఎస్.చక్రనాగ్, ప్రిన్సిపాల్ ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు రికార్డులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయూడీ) విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ ఎంక్వయిరీ కేసుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్టు పంపకపోవడంపై నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులను పిలిపించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2010 సంవత్సరానికి ముందు ఆ తరువాత సుమారు 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వీటన్నింటికి సంబంధించిన ఫైల్స్‌ను తెప్పించుకుని కూలంకషంగా పరిశీలించారు.

ఇదే మొదటి సారి..

నగరపాలక సంస్థ చరిత్రలో ఎప్పుడూ ఎంఏయూడీ విజిలెన్స్ అధికారులు వచ్చిన దాఖలాలు లేవని ఉద్యోగులు చెప్పుకోవడం గమనార్హం. ఏమైనా సిబ్బందిపై విచారణలు ఉంటే విచారణ నిమిత్తం ప్రత్యేక అధికారులను నియమించి వాటిని పరిష్కరించే వారు. కాని సదరు విజిలెన్స్ కేసుల్లో నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి చెక్ పెట్టేందుకు విజిలెన్స్ అధికారులు ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించడంతో ఉద్యోగులు ఒకింత భయాందోళనకు గురైన పరిస్థితి నెలకొంది.

టెంపుల్ హిల్ ఎకో పార్కుకు మరిన్ని హంగులు



టెంపుల్ హిల్ ఎకో పార్కు కొండపై నిర్మిస్తున్న మోగా ధ్యాన కేంద్రం

మంగళగిరి: టెంపుల్ హిల్ ఎకో పార్కుకు మరిన్ని హంగులు సమకూరనున్నాయి. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందించేలా ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన టెంపుల్ హిల్ ఎకో పార్కును తీర్చిదిద్దుతోంది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో అటవీశాఖ అధికారులు రూ.40 లక్షలతో పార్కు కొండపైన నిర్మాణం చేసి ట్రెక్కింగ్ పార్కుతో పాటు ధ్యాన, యోగా కేంద్రాలు, సేద తీరేందుకు బల్లలు, రాళ్ల అమర్చుతున్నారు. ఇప్పటికే వాకింగ్, వ్యాయామం చేసేందుకు వచ్చే నగర ప్రజలకు ఓపెన్ జిమ్, కుటీరాలు, వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్ ట్రాక్, వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన మొక్కలతో వివిధ పేర్లుతో వనాలను ఏర్పాటు చేశారు. నూతనంగా ధ్యాన యోగా కేంద్రాలు, ఏదైనా సమావేశాలు ఏర్పాటు చేసుకునేలా సమావేశమందిరాలు వాటి చుట్టూ ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారి మధుసూదనరెడ్డితో పాటు అధికారులు కొందరు ఇదే ప్రాంతంలో నివాసం ఉంటుండడంతో ప్రతి రోజు అధికారులు వాకింగ్ చేసేందుకు వచ్చి ఆయా నిర్మాణాల పనులు పరిశీలించి పలు సూచనలు చేస్తుండడంతో పనులు చకచకా కొనసాగుతున్నాయి.